క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న నాయకులు

చేవెళ్ల: మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌ను గురువారం చేవెళ్ల బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఆయనను కలిసిన వారు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎస్ బోర్డు మెంబర్ సామ మానిక్యరెడ్డి, బీజేపీ ఏబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజయ్యనేయులుగౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు డి.శర్వలింగం, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎ.శ్రీనివాస్, నాయకులు శ్రీశైలం, బాలయ్య, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఇంగ్లిష్ డే



సరోజినీనాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: భారతదేశ తొలి మహిళా గవర్నర్ సరోజినీనాయుడు జయంతిని పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు రసూల్ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజినీనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంగ్లిష్‌లో పద్యాలు, వ్యాసరచన వంటి పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఇంగ్లిష్‌పై విద్యార్థులు మంచి పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, శీతల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలను విస్తృతం చేయాలి

లయన్ జిల్లా గవర్నర్ కోటేశ్వర్‌రావు



గవర్నర్ కోటేశ్వర్‌రావును సత్కరిస్తున్న లయన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని లయన్ జిల్లా గవర్నర్ డాక్టర్ కోటేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని లయన్స్ భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవాభావం ఉన్న వారు క్లబ్ సభ్యులుగా ఉన్నారని తెలిపారు. స్వార్థం లేకుండా ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ.. క్లబ్‌లు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. రూరల్ క్లబ్‌లలో ఆమనగల్లు క్లబ్ అందించే సేవలు ప్రశంసనీయమని, క్లబ్ ఏర్పాటై.. నాలుగు దశాబ్దాలు గడుస్తున్నా ప్రజాసేవలో మరింత పట్టుదలతో ముందుకు సాగుతుందని వెల్లడించారు. అనంతరం కోటేశ్వర్ రావును లయన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ గవర్నర్ సురేశ్ జాగ్నాని, క్యాబినెట్ కార్యదర్శి సత్యనారాయణ, కో ఆర్డినేటర్ యాదయ్య, లయన్ మాజీ గవర్నర్లు చెన్నకిషన్‌రెడ్డి, రమేశ్ బాబు, రాధాకృష్ణ, రీజియన్ చైర్మన్ శ్రీను, జోన్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, క్లబ్ కార్యదర్శి మహేశ్, కోశాధికారి నర్సింహ, పీఆర్‌ఓ పాష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి వారికి పాఠాలు బోధించారు. అధికారులుగా వ్యవహరించారు. ఆర్‌జేడీగా చిన్న, డీఈఓగా ప్రవీణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడిగా గణేశ్, 25 మంది టీచర్లుగా వ్యవహరించారు. అనంతరం చిన్నారులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

ఆదర్శం.. అజీజ్‌నగర్ పాఠశాల

- సమగ్ర శిక్షణ పథకంలో జాతీయ స్థాయికి ఎంపికైన అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల
- 70 రకాల అంశాలకు ఆర్థిక వనరులు
- 2024–25 విద్య సంవత్సరానికి రూ.5లక్షల నిధులు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులతో కళకళలాడుతున్న అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల

మొయినాబాద్‌రూరల్: సమగ్ర శిక్షణ పథకం జాతీయ స్థాయిలో అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల ఎంపికైంది. ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎం, ఎస్ఎస్, ఆర్ఐ) సమగ్ర శిక్షణ పథకం జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ద్వారా విద్యార్థులు అధికంగా ఉండి పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలను ఎంపిక చేసింది. సమగ్ర శిక్షణ పథకం ద్వారా 70 రకాల అంశాలకు ఆర్థిక వనరులు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. ఇందుకు ఈ సంవత్సరం ఎంపికైన పాఠశాలలకు ఐదు లక్షల నిధులు మంజూరు చేసింది. దీంతో పాఠశాలలో 70 అంశాల్లో వివిధ అభివృద్ధి పనులతో పాటు విద్యార్థులకు పలు ఆక్టివిటీస్‌కి ఈ నిధులు వాడుకోవడానికి అవకాశం కల్పించారు. సమగ్ర శిక్షణ పథకం ద్వారా పాఠశాల ఎంపికలో భాగంగా భౌతిక వనరులు, పూర్తిస్థాయి ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో ఉన్న విద్యార్థులు, పాఠశాల వనరులను సమాజ వినియోగం చేసుకోవడం వీటన్నింటిని గుర్తించి పాఠశాలల ఎంపిక చేశారు.

455 మంది విద్యార్థులు..

మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 455 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. జాతీయ స్థాయిలో ఎంపికైన పాఠశాలకు 70 రకాల అంశాలకు ఆర్థిక వనరులు వినియోగించేందుకు అవకాశం కల్పించారు. సాధారణంగా క్రీడలు, యోగా, విద్య, కరాటే, సైన్స్ ల్యాబ్, హరిత పాఠశాల, పచ్చదనం పరిశుభ్రత, ఆరోగ్యపరంగా విద్యార్థులకు జ్ఞాన బోధన, పాఠశాలలో వినియోగం ఉంటుంది. విద్య, విహార యాత్రలకు విడుదలైన నిధులు ఉపయోగించుకుంటారు. హరిత హారం, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. ఉన్నత విద్య అభ్యసించేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తారు. దీంతో ఆ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, సంపూర్ణమైన విద్య పొందడానికి అవకాశం కేంద్ర ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో అజీజ్‌నగర్ పాఠశాల విద్యా ర్థులు కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలైన రూ.5లక్షల నిధులలో విద్య, వైజ్ఞానికంలో భాగంగా పలు విహార యాత్రలు రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీ, వండర్‌లా లాంటి సందర్శించి తిలకించారని అధ్యాపకులు, విద్యార్థులు పేర్కొంటున్నారు.

సంతోషంగా ఉంది



కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా పథకానికి తమ పాఠశాల ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ముఖ్యంగా ఈ పాఠశాలలో 455 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు సబ్జెక్టుల పరంగా పూర్తి స్థాయిలో ఉపాధ్యాయుల సంఖ్య ఉంది. ఈ విద్యా సంవత్సరానికి సమగ్ర శిక్షణ పథకం ద్వారా ఐదున్నర లక్షల నిధులు మంజూరయ్యాయి. అందులో గ్రీన్ స్కూల్‌కు మూడు లక్షల నిధులు, విహార యాత్రలకు రెండున్నర లక్షలు నిధులు వచ్చాయి. దీంతో విద్యార్థులకు నాణ్యతమైన విద్యను అందిస్తూ.. విహార యాత్రలకు తీసుకువెళ్లాం. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

– జాజాపురం శేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు



కొందుర్గులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడంతో పాటు పల్లెల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మండలంలోని రేగడిచిల్కమర్రి, ముట్పూర్, ఉత్తరాసిపల్లి, గంగన్నగూడ, కొందుర్గు, పులుసుమామిడి గ్రామాల్లో ఆయన పర్యటించి సీసీరోడ్లు, ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రాధాన్యత క్రమంలో నెరవేరుస్తామన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రామయ్యగౌడ్, సయ్యద్‌సాదిక్, మల్లేశ్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, నరేందర్, కృష్ణ, నర్సింలు, అంజిరెడ్డి, శ్రీను అంజనేయులు, ద్విజేందర్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి



దారెడ్డి వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: సమీపిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని మండల బీఆర్ఎస్ నూతన అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆయన స్వగ్రామమైన కేతిరెడ్డిపల్లి గ్రామంలో మొయినాబాద్ గ్రామ నాయకులు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాహూఫ్, మోత్కుపల్లి గ్రామ నాయకులు వెంకట్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ తీరును వ్యతిరేకిస్తున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారని, బీఆర్ఎస్ గెలిపించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిద్దయ్య, శ్రీకాంత్‌రెడ్డి, శివయ్య, చిన్నయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యత పెంపునకు కృషి

ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న పోచయ్య

మొయినాబాద్‌రూరల్: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూ.పోచయ్య, అజీజ్‌నగర్ పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధించాలని సూచించారు. కార్యక్రమంలో సోషల్ స్టడీస్ బోధన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి కల్యాణానికి తరలివచ్చిన భక్తులు



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

కల్యాణం.. వైభోగం

- కనుల పండుగగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం
- భారీగా తరలివచ్చిన భక్తులు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని కనకమామిడి గ్రామ సమీపంలో గల సంగమేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు గురువారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు, అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో గణపతి పూజ నిర్వహించి గర్భగుడిలో శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం మామిడి తోరణాలు, పూలమాలలతో అలంకరించిన కల్యాణ మండపంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా జరిపించారు. ఈ మహోత్సవానికి భక్తులు కనువిందుగా తిలకించారు. స్వామివారికి వేదపండితులు, ఆలయ నిర్వాహకులు నూతన వస్త్రాలు, పూలు, తాళి సమర్పించగా ముత్యాల తలంబ్రాలను ముర్తుజాగూడ గ్రామానికి చెందిన విక్రమ్‌రెడ్డి దంపతులు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ఆవరణ కిటకిటలాడింది. కల్యాణం అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

విద్యార్థుల ప్రతిభ అభినందనీయం



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, సిబ్బంది

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు విద్యతో పాటు విజ్ఞానాన్ని ప్రదర్శించినప్పుడే ఉన్నత శిఖరానికి ఎదుగుతారని హెచ్‌ఎం శేఖర్‌రెడ్డి అన్నారు. విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పేద విద్యార్థుల స్కాలర్‌షిప్‌లో నిర్వహించిన పోటీ పరీక్షల్లో మండల పరిధిలోని అజీజ్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు పాల్గొనగా.. ముగ్గురు విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. వారిని గురువారం పాఠశాల ఆవరణలో సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొని గెలుపొందినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. ముగ్గురు విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు వారికి సంవత్సరానికి 12వేల రూపాయలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

మున్సిపల్ కమిషనర్ యోగేశ్



మాట్లాడుతున్న కమిషనర్ యోగేశ్, సీఐ శ్రీనివాస్‌గౌడ్

శంకర్‌పల్లి: ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ నిషేధించాలని, లేదంటే మానవాళి మనుగడే ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ యోగేశ్ అన్నారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధంపై దుకాణదారులకు, కూరగాయల వ్యాపారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 120 మైక్రాన్ల మందం కన్నా తక్కువ ఉండే ప్లాస్టిక్ కవర్లను ఎట్టి పరిస్థితుల్లో వాడొద్దని స్పష్టం చేశారు. అలాంటి వారిపై 2019 మున్సిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా వ్యాపారులు సైతం తమ వద్దకు వచ్చే ప్రజలకు ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై వివరించాలని సూచించారు. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. వ్యాపారస్తులు తమ వాహనాలను రోడ్లపై కాకుండా తమకున్న స్థలంలోనే నిలపాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, పర్యావరణాధికారి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ



విశాల్

ఆమనగల్లు: జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాల్లో ఆమనగల్లు ప్రభుత్వ కళాశాల విద్యార్థి విశాల్.. 83.87 శాతంతో సత్తా చాటాడు. ఈ సందర్భంగా విద్యార్థి విశాల్‌ను ప్రిన్సిపాల్ మాధవరావు, అధ్యాపకులు కృష్ణయ్య అభినందించారు.

నిరుపేద వృద్ధులకు దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు, స్వెటర్లను అందజేస్తున్న గీతాథామస్‌రెడ్డి దంపతులు

షాద్‌నగర్‌రూరల్: నిరుపేదలకు సాయం చేసినప్పుడే ఎంతో సంతృప్తి కలుగుతుందని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్‌నీడ్(ఎఫ్‌సీఎన్) వ్యవస్థాపకుడు డాక్టర్ గీతాథామస్‌రెడ్డి అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ సమీపంలోని ఎఫ్‌సీఎన్ ఆధ్వర్యంలో సుమారు 500ల మంది వృద్ధులకు గీతాథామస్‌రెడ్డి దంపతులు దుస్తులు, దుప్పట్లు, స్వెట్టర్లు, మంకీక్యాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. నిరుపేదలకు సహాయ సహకారాలను అందించినప్పుడే నిజమైన తృప్తి లభిస్తుందన్నారు. అనంతరం వృద్ధులు గీతాథామస్‌రెడ్డి, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రతీ పౌరుడికి సమానత్వాన్ని అందిద్దాం



అంబేడ్కర్, బాపు చిత్ర పటాలను ప్రదర్శిస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి

షాద్‌నగర్‌రూరల్: ప్రతీ పౌరుడికి సమానత్వం, సమన్యాయం, స్వేచ్ఛను అందించేందుకు ఎన్ఎస్‌యూఐ కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. గురువారం పట్టణంలోని ముఖ్య కూడలిలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకటస్వామి హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రాజ్యాంగం పత్రాలను, బాపు, అంబేడ్కర్ చిత్రపటాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ కలిసి దేశ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలనే ఆలోచనతో దేశ వ్యాప్తంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే నేడు షాద్‌నగర్‌కు రావడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమంలో భాగస్వాములై రాజ్యాంగాన్ని కాపాడుకోవడంతో పాటుగా భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ విలువలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య యోధులు మహాత్మాగాంధీ దేశానికి చేసిన సేవలను, కాంగ్రెస్ పార్టీ విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి అనుదీప్ మాట్లాడుతూ.. బాపు సత్యం, భీమ్ సాధికారత, రాజ్యాంగ విజ్ఞతతో మన దేశాన్ని, మన విలువలను కాపాడుకోవాలన్నారు. ప్రతి పౌరుని సమానత్వం, న్యాయం, హక్కుల సంరక్షకులుగా నిలబడదామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అక్రమ్, సుమన్, హర్ష, నందీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లిలో మహమ్మాయిదేవి కల్యాణ మహోత్సవ వేడుకలు రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం రాత్రి ఎమ్మెల్యే అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. రథోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరుణాకర్, ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బాలరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, సభ్యులు సంతోష్, శ్రీనివాస్, వెంకటేశ్, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత

- అర్హులందరికీ ఆరు గ్యారంటీలు
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



న్యామతాపూర్‌లో రైతులకు బోరుమోటార్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజాపాలన కొనసాగిస్తున్న ప్రభుత్వంపై..ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో గురువారం పీసీసీ సభ్యులు అయిల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డిలతో కలిసి ఆయన పర్యటించారు. కడ్తాల్ మండలం మక్తమాదారంలో రూ.15 లక్షలతో నిర్మించే సీసీరోడ్లు, మురుగు కాలువలు, రావిచేడు గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించే అంగన్‌వాడీ భవనం, సలార్‌పూర్‌లో రూ.10 లక్షలతో నిర్మించే సీసీరోడ్ల నిర్మాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సలార్‌పూర్ 9 మంది చెంచులకు వ్యవసాయ బోరు మోటార్‌లను అందజేశారు. తలకొండపల్లి మండలం పాతకోటతండాలో రూ.30 లక్షలతో నిర్మించే అంగన్‌వాడీ భవనం, ప్రహరి నిర్మాణం, సీసీరోడ్లు, పడకల్‌లో రూ.15 లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.

బీఆర్ఎస్‌వి పగటి కలలు

ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నప్పటికీ.. ఓర్వలేని విపక్షాలు ప్రజలను తప్పుదోవపట్టిస్తూ విషప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్యే కసిరెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తామంటూ పగటి కలలు కంటుందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో మరో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమాలలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, పార్టీ కడ్తాల్, తలకొండపల్లి మండలాల అధ్యక్షులు బిచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, తలకొండపల్లి సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, నాయకులు హన్మానాయక్, బిక్యానాయక్, డాక్టర్ శ్రీనివాస్, డేవిడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.